సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 2-1-2025

సంపుటి: 20 సంచిక: 238

పేజీలు: 4 వెల: రూ.1


## కోటిమంది టీడీపీ కార్యకర్తలకు బీమా



(సత్యంన్యూస్, అమరావతి)

కోటిమంది కార్యకర్తలకు ప్రమాదబీమా కల్పించేలా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు మంత్రి లోకేష్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ప్రాగ్మ్యాటిక్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు కోటిమంది కార్యకర్తల బీమాకు తొలివిడతలో రూ.42 కోట్లు పార్టీ చెల్లించింది. వచ్చే ఏడాది కూడా దాదాపు ఇదే మొత్తంలో ప్రీమియం సొమ్మును పార్టీనే చెల్లిస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5 లక్షలు ప్రమాద బీమా లభిస్తుంది.



# పేకాట శిబిరాలకు పోలీసుల రూట్‌మ్యాప్?

- బెండిగేటు-టెక్కలిపట్నం వయా గారబంద
- శిబిరంలో యువకుడ్ని చితక్కొట్టిన నిర్వాహకుడు
- ప్రతిదాడి భయంతో కిరాయిమూకల పహారా

**జిల్లా సరిహద్దులో ఒక నేరం చేసి పక్కనే ఉన్న ఒడిశాకు పరారైన నిందితులను కొద్ది గంటల వ్యవధిలో మన పోలీసులు తెచ్చి రిమాండ్‌కు పంపిస్తున్నారు. కావాలంటే ఆమధ్య గుడివీధిలో పట్టపగలే జరిగిన చోరీలో ఎన్ని రాష్ట్రాలు దాటి మన పోలీసులు నిందితులను ఇక్కడకు తెచ్చారో ఒక్కసారి గుర్తుచేసుకోండి. అంతెందుకు.. మొన్నటికి మొన్న ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో రెండుచోట్ల చైన్‌స్నాచింగ్ జరిగితే, ఒడిశా నుంచి ఈడ్చుకొచ్చి ఇక్కడ మీడియా ముందు పెట్టారు మన పోలీసులు. ఇక పక్క రాష్ట్రంలో గంజాయి పార్శిల్ అయితే చాలు.. జిల్లాలో ఇట్టే పట్టేసుకుంటున్నారు. ఇన్ని సాహసాలు చేస్తున్న పోలీసుల చెంతనే మరికొందరు అదే యూనిఫామ్‌తో సొమ్ములకు లొంగిపోతున్నారు. కేవలం మన పరిధిలో కాదు.. ఒడిశా బోర్డర్‌లో జరుగుతుంది అన్న నెపం చూపించి జిల్లా నలుమూలల నుంచి వెళ్తున్న పేకాట నిర్వాహకులకు రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అసలు పేకాట శిబిరం ఎక్కడ పెట్టాలో వారికి రూట్‌మ్యాప్ ఇస్తున్నది కూడా పోలీసులేనన్న ఆరోపణలూ లేకపోలేదు.**







(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాతపట్నం సర్కిల్ పరిధిలో ప్రతి రోజు జిల్లా సరిహద్దుకు సమీపంలో ఒడిశాలోని పర్లాకిమిడి తాలూకా గారబందలో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై 'సత్యం' పత్రికలో వచ్చిన వరుస కథనాలపై జిల్లా పోలీసు బాస్ స్పందించారు. సదరు పోలీసు అధికారులకు జిల్లా పోలీసు బాస్ వివరణ అడిగారు. ఆ తర్వాత రెండు రోజుల పాటు పేకాట శిబిరానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత సంబంధిత పోలీసు సిబ్బందే పేకాట శిబిరం నిర్వాహకులైన బెండి తులసీ, తాండ్ర తేజ, సీపాన శ్రీను, గోపీలకు కొత్తగా రూట్‌మ్యాప్ ఇచ్చారని విశ్వసనీయ సమాచారం. ప్రతిరోజు స్థానిక కొత్తరోడ్డు నుంచి పేకాట నిర్వాహకులు కాపలాదారులతో పాటు పేకాటరాయుళ్లతో కలిసి వెళుతుండేవారు. ఎప్పుడైతే 'సత్యం' కథనాల ద్వారా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డికి ఈ విషయం తెలిసిపోయిందో... వీరు వెళ్లే కార్లను టెక్కలి, మెళియాపుట్టి, చాపర మీదుగా కాకుండా టెక్కలి, బెండిగేట్, టెక్కలిపట్నం మీదుగా గారబందకు వెళ్లాలని సూచించారని తెలిసింది. అప్పటి వరకు రోజుకు రూ.5వేలు ఇచ్చే పేకాట నిర్వాహకులు రూట్‌మ్యాప్‌ను ఇచ్చిన తర్వాత వారానికి రూ.70వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారని తెలిసింది.

గత నాలుగు నెలలుగా ప్రతి రోజు జిల్లా కేంద్రం నుంచి జిల్లా సరిహద్దులు దాటి ఒడిశాలో పేకాట శిబరాలను నిర్వహిస్తున్న వారికి సరిహద్దులో ఉన్న జిల్లా పోలీసులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారనే ఆరోపణలు అందుకే వినిపిస్తున్నాయి. పేకాట నిర్వాహకుల్లో ప్రధాన వాటాదారుడైన మాజీ సైనికుడుగా చెప్పుకుంటున్న తాండ్ర తేజ తన వద్దకు పేకాడడానికి వచ్చిన మెళియాపుట్టి మండలం బందపల్లికి చెందిన ఒక యువకుడిపై తన మనుషులతో దాడి చేయించినట్టు తెలిసింది. పేకాడుతున్న సందర్భంలో యువకుడి కాలు తేజకు తగలినందుకు సదరు యువకుడిపై విచక్షణారహితంగా దాడిచేశారట. దీనికి ప్రతిగా సదరు యువకుడు టెక్కలిలో గత కొద్ది రోజులుగా ప్రతిదాడి చేయడానికి బందపల్లికి చెందిన యువకులతో కలిసి కాపుకాసినట్టు తెలిసింది. దీంతో టెక్కలి నుంచి బందపల్లి, మెళియాపుట్టి మీదుగా వీరు వెళ్లడం మానేశారు. ప్రతిదాడి భయంతో తాండ్ర తేజ ఒడిశాలోని గారబంద పేకాట శిబిరానికి వెళ్లడం మానేశాడని తెలిసింది. బాధితుడు మాత్రం ఇప్పటికీ డిప్రెషన్‌లోనే - మిగతా 4లో




## కనకరాజు విరాళం

**'అమ్మప్రేమ-ఆదరణ'కు రూ.6వేలు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టెక్కలిలో పేద, తల్లిదండ్రులు లేని చిన్నారులకు అండగా నిలుస్తున్న అమ్మ ప్రేమ-ఆదరణ సంస్థకు శ్రీకాకుళం నగరానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు రూ.6వేలు విరాళం అందించారు. ఇక్కడ 5నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారని, టెక్కలి సత్యసాయి సేవాసమితి భోజనం అందిస్తున్నారని, కొంతమంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా వచ్చి ట్యూషన్లు చెబుతున్నారని, మిగిలిన అవసరాల కోసం దాతల సహకారం అందించాలని కనకరాజు కోరారు.

## రథసప్తమి రాష్ట్ర పండుగగా గుర్తించడంపై హర్షం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే ప్రభుత్వ పండగగా గుర్తించి నిర్వహించాలనుకోవడం హర్షించదగ్గ విషయమని జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు గొలివి కరుణాకరరావు కొనియాడారు. రథసప్తమి వేడుకలకు జిల్లా వ్యాప్తంగా తరాలుగా అనేక గ్రామాల నుంచి ముందురోజే వచ్చి అరసవిల్లిలో ఉండి దైవదర్శనం చేసుకొని మొక్కలు చెల్లించుకు వెళ్లడం ఆనవాయితీగా ఉంది. ఇలా వచ్చే సాధారణ భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా సాఫీగా దర్శనం జరిగేటట్టు ప్రభుత్వం యంత్రాంగం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా కూడా స్వామివారిని దర్శించుకోవడానికి అనేకమంది భక్తులు వస్తారని, వారందరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా పంపించవలసిన ఆవశ్యకత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని, అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పండుగకు సార్థకత ఉంటుందన్నారు. గతంలో భక్తులు ఇబ్బందులకు గురైవుంటే వాటిని పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అలాగే స్వామివారి పట్ల ఉన్న అచంచల భక్తి విశ్వాసాలతో ఆలయానికి డొనేషన్‌గా ఇచ్చిన భక్తులు అనేకమంది ఈరోజు కోసమే ఎదురు చూస్తారని, అందువల్ల రథ సప్తమి వేడుకల్లో డోనర్స్‌కు కూడా చక్కనైన ప్రాధాన్యతను ఇచ్చి వారందరికీ దర్శనం జరిగేటట్టు ఏర్పాటు చేయవలసిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. దీనివల్ల భక్తులలో విశ్వాసం పెరిగడంతో పాటు డోనర్ల సంఖ్య పెరిగే అవకాశం వుందన్నారు. సాధారణ భక్తులకు మేలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి పరమార్థం ఉంటుందన్నారు. రథసప్తమి వేడుకలకు సాధారణ భక్తులను వీఐపీలుగా భావించి దర్శన ఏర్పాట్లు చేయాలని, ఆలయంలో విధులు నిర్వహించేవారు ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతికి లోబడకుండా వ్యవహరించాలని కరుణాకరరావు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## శంకరయ్యా.. గంగ ఇక్కడ పొంగుతుంది చూడు!

**సెప్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన రిజర్వ్ సైట్**

**ఉమెన్స్ కాలేజీ వెనుకభాగంలో ఉండలేకపోతున్న ప్రజలు**

**సొంతిళ్లు ఖాళీ చేస్తున్న వైనం**

**రోగాలతో కునారిల్లుతున్న కాలనీ**



**నగరంలో కాలువలు ఉన్న చోట పూడికలు తొలగించారు, పలకలు సరిచేశారు.. బాగానే ఉంది. అసలు కాలువే లేనిచోట మురుగునీరు పొంగి ప్రవహిస్తుంటే ఏంచేయాలి? అది కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న సంస్థల నుంచి వస్తున్న వర్థాలవైతే ఎవరికి చెప్పకోవాలి. కాలువల్లో ప్రవహించాల్సిన వ్యర్థాలు ప్రభుత్వ స్థలంలోనే స్టోరేజ్ అయితే ఏమని చెప్పకోవాలి?**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగర పరిధిలో ఎన్నడూ లేనంతస్థాయిలో కాలువల్లో పూడికలు తీశారు. దీనిని ఎవరూ కాదనలేరు. ప్రతీ ఏడాది వర్షాకాలం ముందు పూడికలతీత సాధారణమే అయినప్పటికీ ఇంత పకడ్బంధీగా నగరంలో పూడికతీత పనులు జరిగిన సందర్భం మరొకటి లేదు. అకాల వర్షాల కారణంగా పూడికల తొలగింతకు అడ్డంకులు ఏర్పడినా ఎక్కడా తగ్గకుండా ఇప్పటికీ కాలువల్లో పూడికలు తీస్తునే ఉన్నారు. ఇది కచ్చితంగా హర్షించదగ్గ అంశమే. పూడికలు తీసిన కాలువల మీద పలకలు సరిగా వేయలేదని ఫిర్యాదులు వస్తే, దానికి కూడా స్పందించి రెండు రోజులుగా పలకలు సరిచేస్తున్నారు. దీన్నీ స్వాగతించాల్సిందే. ప్రజా ప్రభుత్వమంటే ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే కదా!. కానీ ఇప్పుడు ఇక్కడ ప్రస్తావిస్తున్న సమస్య వీటికి పూర్తిగా భిన్నమైనది. నగరంలో కాలువలున్న చోట పూడికలు తొలగించారు, పలకలు సరిచేశారు బాగానే ఉంది. అసలు కాలువే లేనిచోట మురుగునీరు పొంగిప్రవహిస్తుంటే ఏంచేయాలి? అది కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న సంస్థల నుంచి వస్తున్న వర్థాలవైతే ఎవరికి చెప్పుకోవాలి. కాలువల్లో ప్రవహించాల్సిన వ్యర్థాలు ప్రభుత్వ స్థలంలోనే స్టోరేజ్ అయితే ఏమని చెప్పుకోవాలి? సరిగ్గా ఈ సమస్యను ప్రస్తావించడమే ఈ కథనం సారాంశం. స్థానిక మహిళా డిగ్రీ కళాశాల వెనుక మహాలక్ష్మీనగర్ కాలనీ దక్షిణ భాగంలో ఉన్నవారు గత కొద్ది నెలలుగా సొంతిళ్లను సైతం వదిలేసి వేరే చోటకు అద్దెకు పోతున్నారు. ఉన్నవారు రోగాలతో ఆసుపత్రి పాలవుతున్నారు. దీనికి కారణం ఏంటని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మహాలక్ష్మీనగర్ కాలనీ ఉమెన్స్ కాలేజీ వెనుక ఉన్న రిజర్వ్ సైట్‌లో పెద్ద ఎత్తున మురుగునీరు గత కొన్నేళ్లుగా నిల్వ ఉండిపోతోంది. ఈమధ్య కాలంలో ఈ మురుగుకు తోడు ఎండ లేకపోవడం, అకాల వర్షాల వల్ల పూర్తిగా దోమలు పునరుత్పత్తి కేంద్రంగా ఈ ప్రాంతం తయారైంది. తమ రిజర్వ్‌సైట్‌ను పరిరక్షించుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం దీని చుట్టూ ప్రహరీ అయితే కట్టిందిగానీ, ఈ సైట్ లోపలికి ఎటువంటి వ్యర్థాలు వదలకూడదన్న జాగ్రత్త మాత్రం తీసుకోలేదు. ప్రైవేటు వ్యక్తులు తమ ఇంటి వాడకం నీరు, లేవెట్రీ వ్యర్థాలను బయటకు విడిచిపెడితే మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకునేదేమో? కానీ ఉమెన్స్ కాలేజీ వెనుక వికలాంగుల హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో 200కు పైబడి విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌కు మెయింటినెన్స్ లేకపోవడం, ఈ బిల్డింగ్‌కు, డ్రైనేజీ వ్యవస్థకు లింక్ లేకపోవడంతో దాదాపు 15 నుంచి 20 సెంట్ల మధ్య ఉన్న మున్సిపల్ రిజర్వ్ సైట్‌లోకి హాస్టళ్ల వ్యర్థాలన్నీ వదిలేస్తున్నారు. చివరకు మరుగుదొడ్ల కనెక్షన్ కూడా రిజర్వ్ సైట్‌లోకే ఉండటం క్షమించరాని అంశం. ఇదే విషయం మీద దివ్యాంగుల శాఖ ఏడీకి గతంలో ఫిర్యాదులు వచ్చినా ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదు. సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలతో ఈ రిజర్వ్ సైట్ నిండిపోవడం చూస్తే ఆ పరిసర ప్రాంతాల్లో మనుషులు ఎలావుంటారో వేరేగా చెప్పనక్కర్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లు లేని కాలనీలకు రోడ్లు వస్తున్నాయని, ఆ పక్కనే కాలువలు వేస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇందులో వాస్తవం లేకపోలేదు. కానీ దివ్యాంగుల సంక్షేమ శాఖ వద్ద కూడా సొమ్ములున్నాయన్న విషయం మర్చిపోకూడదు. ఇటు మున్సిపాలిటీ, అటు దివ్యాంగుల సంక్షేమ శాఖ, రిజర్వు సైటూ మూడూ ప్రభుత్వానివే కావచ్చు. కానీ జనం ప్రాణాలు మాత్రం ప్రభుత్వానివి ఎప్పటికీ కాలేవు. ఈ ప్రాంతం నుంచి బయటపడలేనివారు ఇప్పటికీ రోగాలతో మూలుగుతున్నారు. వీలైతే స్వయంగా ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి వచ్చి తమ గోడును, మున్సిపాలిటీ రిజర్వ్ స్థలాన్నీ చూసి వెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.

• ఎడిటోరియల్

# మతసామరస్యం ఎక్కడ?

నేడు దేశంలో బీజేపీ బాపుజీపై చూపుతున్న గౌరవం కానీ, ఒలకపోస్తున్న ప్రేమ కానీ చూస్తుంటే 'పైపై సొగసులు కల్ల సుమా.. లోపలిదంతా డొల్ల సుమా.. నిజం తెలియమని నేనంటాను.. లేదా కొంపే గుల్ల సుమా!' అన్న దాశరథి కృష్ణమాచార్య కవితా వాక్కులు గుర్తుకు రాకమానవు. సోమవారం మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా బాపు ఘాట్‌కు ప్రధానమంత్రి దగ్గర నుంచి చోటా మోటా నేతల వరకు క్యూ కట్టి నివాళులర్పించి, అక్కడ జరిగే సామూహిక ప్రార్థనల్లో కూడా పాల్గొన్నారు. వాళ్లే నిన్నటికి నిన్న పాట్నాలో నిర్వహించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో మహాత్ముడిపై ద్వేషాన్ని వెల్లకక్కారు. భోజ్‌పురి గాయకురాలు దేవి గాంధీజీకి అత్యంత ప్రీతిపాత్రమైన 'రఘుపతి రాఘవ రాజారామ్' భజనను ఆలపిస్తున్న తరుణంలో అందులో 'అల్లా' అన్న పదం వచ్చిందన్న కారణంతో ఆమెను కమల దళం అడ్డుకున్నది. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సహా పలువురు నాయకులు ఆమె నుంచి మైక్రోఫోన్ లాక్కొని జైశ్రీరాం అంటూ నినాదాలు చేయడం గర్హనీయం. అల్లా పేరును ఉచ్ఛరించినందుకు క్షమాపణ చెప్పాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చి మరి చెప్పించారు. 'జై సీతారామ్'కు బదులు 'జై శ్రీరాం' అని నినదించాలని ఒత్తిడి తెచ్చారని ఆమె వాపోయారు. 'ఈశ్వర్ అల్లా తేరానామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అని పాడుకున్న జాతిపిత గుండెలను తుపాకీ గుండుతో చీల్చిన గాడ్సే వారసులకు ఆ గీతంలో విద్వేషం కాక ఐక్యత కనబడాలని ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ దేశంలో ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని కాంక్షిస్తూ మహాత్ముడు 'రఘుపతి రాఘవ రాజారామ్' భజన గీతానికి 'ఈశ్వర్ అల్లా తేరే నామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అన్న వాక్యాలను జోడించారు. సూమారు వంద ఏళ్లకు ఆ గీతంలోని 'అల్లా' అన్న పదం కేంద్రపాలకులను కలవరపాటుకు గురిచేస్తోంది. మహాత్ముడి సత్యాహింసలు, సత్యాగ్రహ సూత్రాలు ప్రపంచ ప్రాచుర్యం పొందినట్టుగానే, నిన్నటి విద్వేషాన్ని కూడా ప్రపంచ మీడియా చర్చిస్తూన్నది. కానీ అధర్మం, అసత్యం రాజ్యమై సత్యాలోచనలను అణచివేస్తున్నది. అన్ని మతాల ప్రజలు అన్నదమ్ములుగా సహనంతో జీవించాలని ఘోషించినందుకు ఆనాడు మతోన్మాదికి ఆగ్రహం తెప్పించింది. స్వేచ్ఛ, సమానత్వాలను కోరుకున్నాడు గాంధీ. ఇవేవీ గాడ్సే భావానుచరులకు మింగుడుపడని విషయాలు. అందుకే వాళ్లిప్పుడు సత్యం, న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే వారిని అణచివేసే హతమార్చే పనిలో ఉన్నారు. అందుకు అనేక ఉదాహరణలున్నాయి. 'యూపీ మే కాబా?' అని ఉత్తరప్రదేశ్‌లో ప్రజల బాధలను, రాజకీయుల దుర్మార్గాలను, సామాజిక పరిస్థితులను వ్యంగ్యంగా గానం చేసిన భోజ్‌పురి జానపద గాయని నేహాసింగ్‌కు నోటీసులిచ్చి నానా యాగీ చేసింది యోగీ సర్కార్. ఎవరు గొంతు విప్పినా వీరు నిర్బంధకాండకు పూనుకుంటున్నారు. ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మత సామరస్యత పోయి, మత విద్వేషం, మానవతా విధ్వంసం పెల్లుబుకుతున్న సందర్భాన శాంతి, అహింసల గాంధీతత్వాన్ని చర్చించటం సాహసమే. మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడు గాంధీజీ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు ఆ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జోరుగా సాగుతున్నాయి. ఆయన ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భిన్నత్వంలో ఏకత్వానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి విద్వేష హింసాలోచనల పరంపరనే. ఇప్పుడదే ఉన్మాదం సామూహిక విపత్తుగా పరిణమించిందన్న వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవాలి. అయ్యప్ప మాలలో ఉన్న విద్యార్థికి పొరపాటున ప్రధానోపాధ్యాయుడి కాలు తగిలిందన్న కారణంతో రెచ్చిపోయారు. దళిత ఉపాధ్యాయుడిపై కక్షగట్టింది అక్కడి మతతత్వం. బలవంతంగా ఆ గురువుతో విద్యార్థి కాలుపట్టించి క్షమాపణలు చెప్పించటం గమనిస్తే, మన విద్యా వ్యవస్థలోకి మూఢత్వ విద్వేషం ఎలా దూసుకొస్తుందో తేటతెల్లమవుతోంది. ఇది కేవలం ఒక సంఘటనగానే అర్థం చేసుకోలేము. రాబోయే కాలంలో విజ్ఞానానికి, స్వేచ్ఛకు, విద్యార్థులకు, విద్యా వికాసానికి ఎన్ని అడ్డంకులు రానున్నాయో తెలిపే సూచిక కూడా. రామరాజ్యమని చెప్పుకునే పాలకుల కాలంలో ఈ ఘటనలు ఆశ్చర్యపర్చవు. కానీ, కళాకారులు, రచయితలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరాన్ని ఇలాంటి సంఘటనలు గుర్తుచేస్తున్నాయి.



ఓడలు బండ్లైతై.. బండ్లు ఓడలైతై..
ఈ పడికట్టు సామెత ఎప్పుడూ వింటూనే ఉంటాం. ఎక్కడో ఉద్యోగం చేస్తూ తీవ్ర మానసిక ఒతిళ్లల్లో పనిచేయడం కన్నా.. మన కాళ్ల మీద మనం నిలబడే వ్యాపారం కలిసొస్తే మనమే కింగ్ అనే మాటా వింటుంటాం. ఈ రెండూ ఒకతని విషయంలో నిజమయ్యాయి. కాస్ట్ కటింగ్‌లో భాగంగా ఉద్యోగం కోల్పోయిన సదరు వ్యక్తి.. ఇప్పుడు తన కాళ్లపై తాను నిలబడి జీవిత ప్రయాణాన్నెలా కొనసాగిస్తున్నాడు? తనది కాని కొత్త రంగంలో జీరో నుంచి ప్రారంభమై.. మళ్లీ బతుకుబండినెలా నడిపిస్తున్నాడు..? ఉద్యోగాన్నే నమ్ముకుని ఇంతకాలం బతికిన ఓ సామాన్యుడు.. తన జాబ్ పోగొట్టుకున్నాక కొనసాగుతున్న నిజ జీవిత కథ ఇది.

## అప్పుడు గ్రాఫిక్ డిజైనర్..
# ఇప్పుడు ఆటోడ్రైవర్!

ముంబైకి చెందిన కమలేష్ కమ్టేకర్ ఇప్పుడు ఆటోడ్రైవర్‌గా రూపాంతరం చెందాడు. వాస్తవానికి కమలేష్ ముంబై మహానగరంలోని ఓ బడా కంపెనీలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేసేవాడు. తన కెరీర్ నిర్మాణమే గ్రాఫిక్ డిజైన్స్‌తో చేసుకున్నాడు. అలా 14ఏళ్ల అనుభవమున్న కమలేష్‌ను ఓ ఫైన్ మార్నింగ్ కాస్ట్‌కటింగ్‌లో భాగంగా పక్కకు పెడుతున్నట్టు సదరు కంపెనీ నిర్వాహకులు తెలియజేశారు. సాధారణంగా ఉద్యోగమే జీవితంగా బతికే ఓ మధ్య తరగతి సామాన్యుడికి ఒక్కసారి ఉద్యోగం పోతే కచ్చితంగా మానసిక వేదన అనుభవించక తప్పదు. అలాంటి పరిస్థితిని కమలేష్ కూడా ఎదుర్కొన్నాడు. తాను పనిచేస్తున్న కంపెనీలో ఉద్యోగం కోల్పోయాక ఇంకెన్నో సంస్థల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. వాటంతటవే జాబ్ ఆఫర్స్ వచ్చినప్పుడుండే డిమాండ్‌కు.. మనంతట మనమే ఓ ఉద్యోగం కోసం ప్రయత్నించేటప్పుడు మనల్ని సంస్థలు చూసే చూపుకు ఆస్మాన్ ఫరక్ ఉంటుందనే విషయం ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగస్థులందరికీ ఎంతో కొంత తెలిసిందే. అదిగో అలాంటి అనుభవాలే తను ఉద్యోగం కోల్పోయాక కమలేష్ ఎదుర్కొన్నాడు.



Kamlesh Kamtekar • 2nd
Auto Rickshaw Driver
4d • Edited •
+ Follow

It's almost 5 months completed that I have lost my job due to company cost cutting.

As a Assistant Creative Manager with having 14 years of experience in Graphic Designing I had trying to find new job after losing my previous job.

Even after 5 months, I still haven't found a new job. I had try also with lots of references, with my friends. But till yet I don't get new job. I had lots of applied o linkedin also, but every time my application was getting rejected.

"Sorry we don't have budget for your current role. Or we don't have such a role per your experience. Someone says can you work on low salary budget?....." this of feedback I had received in this last 5 month.

After this feedback, I thought, why not start my own business and earn money a same low salary instead of working somewhere else? At least I will have my own income.

Then I decided "भाड मे जाये नोकरी अब खुदका Business करेंगे" but not in my current field.

So I decided to sacrifice my all designing skills and drive an auto rickshaw.

Give me your blessing for my new business...

Thank you

తనకిష్టమైన రంగమైన గ్రాఫిక్ డిజైనింగ్‌లోకి ప్యాషన్‌తో వచ్చినప్పటికీ.. ఉద్యోగంలో ఉండే తీవ్ర ఒత్తిడి.. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని ఓ అభద్రత మద్యే బతికిన అనుభవాలూ కమలేష్ మదిలో తిష్ఠ వేసుకున్నాయి. దాంతో ఏకంగా తన కార్యక్షేత్రాన్నే మార్చేయాలనుకున్నాడు. అంటే తను పనిచేస్తున్న గ్రాఫిక్ డిజైనింగ్ అనే పనినే వదిలి సొంతంగా ఆటో కొనుక్కుని తోలాలనే ఒక వైరల్ నిర్ణయం తీసుకున్నాడు. అలా కమలేష్ అనే గ్రాఫిక్ డిజైనర్ కాస్తా ఆటో డ్రైవర్ గా రూపాంతరం చెందాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని కమలేష్ లింక్డ్ ఇన్‌లో తన పోస్టులో పేర్కొన్నాడు. కమలేష్ అనుసరించిన లైఫ్ జర్నీ అప్లాజ్ అందుకుంది. వైరల్ గా మారింది.

కంపెనీ కాస్ట్ కటింగ్ లో ఉద్యోగం కోల్పోయి ఐదు నెలలు కష్టపడ్డాను. 14 ఏళ్ల అనుభవముండి.. అసిస్టెంట్ క్రియేటివ్ మేనేజర్ గా పనిచేసిన నాకు.. ఆ తర్వాత ఉద్యోగం రాలేదు. లింక్డ్ ఇన్ వంటి చోట్లా ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకుంటూ పోయానే తప్ప.. తనకు కొత్త ఉద్యోగమైతే రాలేదు. పైగా గ్రాఫిక్ డిజైనింగ్ లో అనుభవజ్ఞుడిగా ఉండి నైపుణ్యమున్నా కూడా.. తనను ఉద్యోగాల కోసం వెళ్లినప్పుడు ఆయా సంస్థల్లోని హెచ్ఆర్ విభాగాల్లో ఇంటర్వ్యూస్ లో అడిగిన తీరు, సాలరీ తగ్గించుకోవాని, అంత ఇవ్వలేమని తూకం వేసిన తీరు తనను కొంత బాధించిందంటాడు కమలేష్.

అందుకే, లేని దాన్ని ఉన్నట్టు తీర్చిదిద్దే గ్రాఫిక్ డిజైన్ అనే కళారంగాన్నే వదిలేసి.. తానింకేం చేయగలనో అది ఆలోచిస్తే బెటర్ అనుకున్నాడు. ఆ క్రమంలో ఈ ఉద్యోగాల కంటే సొంత కాళ్లపై నిల్చోవడమే మంచిదని తీర్మానించుకున్న కమలేష్ ఏకంగా ఓ ఆటో రిక్షా కొనుక్కుని ఇప్పుడు డ్రైవర్ గా గతంలో గ్రాఫిక్ డిజైనర్ గా రోజుకు సంపాదించినదానికి తక్కువ కాకుండా సంపాదిస్తున్నానంటాడు.

కమలేష్ కామ్టేకర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. తన ఆత్మవిశ్వాసం ఇంటర్నెట్ లో ట్రెండింగ్ టాపిక్ అయింది. ఎందరో కమలేష్ చేసిన పనిని శభాష్ అంటున్నారు. అయితే, కమలేష్ అనుసరించిన విధానమే సరైందని రూఢీ చేయడంగాకుండా నిరాశకు కృంగిపోకుండా నిజాయితీగా ఏ పని చేసినా అది విలువైనదే. అల్టిమేట్ గా పొందాల్సింది ఆనందం, తృప్తి అనే విషయాలను కమలేష్ తరహా ఆశావహ దృక్పథంతో ఒంటబట్టించుకుంటే లైఫ్ ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా మళ్లీ రీస్టార్ట్ చేయొచ్చనేందుకు కమలేష్ స్టోరీ ఓ ఉదాహరణ!

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## సాగర్ గాడి లవ్వు..ఎంత క్యూట్‌గా ఉందో..

టాలీవుడ్ యంగ్ హీరో రామ్ పోతినేని.. ఇప్పుడు మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు.పి దర్శకత్వంలో రాపో (రామ్ పోతినేని) 22 సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఏజ్ స్టోరీతో ఫీల్ గుడ్ లవ్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఆ సినిమాలో మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా యాక్ట్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి గ్రాండ్‌గా నిర్మిస్తున్న ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ప్రేమతో ఈ కొత్త సంవత్సరం అంటూ నిన్న పోస్ట్ పెట్టిన మేకర్స్.. నేడు స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. భాగ్యశ్రీ బోర్సే లుక్‌ను రివీల్ చేశారు. మన సాగర్ గాడి లవ్.. మహాలక్ష్మి అంటూ హీరో హీరోయిన్లు ఉన్న క్రేజీ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అయితే పోస్టర్ లో భాగ్యశ్రీ చాలా క్యూట్ గా ఉన్నారు. ట్రెడిషనల్ వేర్ చూడీదార్ లో ఉన్న భాగ్యశ్రీ అందానికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. సింపుల్ గా అండ్ గోర్జియస్ గా ఉన్నారని చెప్పాలి. ఇక రామ్ లుక్ అయితే ఫుల్ రిఫ్రెషింగ్ ఉంది. ఆయన ఎక్స్‌ప్రెషన్‌తో అదరగొట్టేశారు. రామ్, భాగ్య కాలేజీకి వెళుతున్నట్లు అర్థమవుతోంది.

ఇద్దరి మధ్య కెమిస్ట్రీ అట్రాక్టివ్‌గా ఉంది. ఓవరాల్‌గా పోస్టర్.. మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. పోస్టర్ బట్టి.. డైరెక్టర్ ఈసారి కూడా ఫ్రెష్ కంటెంట్‌తో రానున్నట్లు క్లియర్‌గా తెలుస్తోంది. – తుపాకి.కామ్ సౌజన్యంతో...











ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల టిక్కెట్ల ధరలు భారీగా పెరగనున్నాయని ఒక అంచనా. ఈ సంక్రాంతికి ముగ్గురు అగ్ర హీరోలు నటించిన సినిమాలు రిలీజవుతుండగా టికెట్ పెంపుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ శంకర్ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కింది. అలాగే నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్, విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం బరిలో ఉన్న పెద్ద సినిమాలు. అందువల్ల వీటికి తొలి వారం టికెట్ ధరల పెంపు వర్తించనుందని భావిస్తున్నారు. ఈ మూడు సంక్రాంతి విడుదలలకు ఆంధ్రప్రదేశ్‌లో తేదేపా ప్రభుత్వం భారీ పెంపును మంజూరు చేస్తుందని టాక్ వినిపిస్తోంది.

## సంక్రాంతి సినిమాలకు
# టిక్కెట్ రేట్ల పెంపు?

రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ అసాధారణ బడ్జెట్ తో తెరకెక్కిన చిత్రం. శంకర్ రాజీ లేకుండా లావిష్‌గా తెరకెక్కించారు. దీనికోసం నిర్మాత దిల్ రాజు రాజీ అన్నదే లేకుండా బడ్జెట్ వెచ్చించారు. అందు వల్ల గేమ్ ఛేంజర్ నిస్సందేహంగా పండుగకు అతిపెద్ద చిత్రం. టికెట్ ధరల పెంపుతోనే రికవరీ సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ఈ సినిమాకు రూ.సింగిల్ స్క్రీన్‌లలో రూ.135 పెంపుదల వర్తించే వీలుంది. అలాగే మల్టీప్లెక్స్‌లలో రూ.175 పెంచుతారు. 1 ఏఎం నుండి షెడ్యూల్ చేసిన బెనిఫిట్ షోల కోసం టికెట్ ధర రూ. 600 (జీఎస్టీతో కలిపి) వరకూ ఉంటుందని అంచనా. బాలకృష్ణ డాకు మహారాజ్‌కు సింగిల్ స్క్రీన్‌లలో రూ.110 పెంపు ఉండనుండగా, మల్టీప్లెక్స్ లలో రూ.135 పెంపు వర్తిస్తుందని అంచనా. బాలయ్య చిత్రానికి ఉదయం 4గంటల నుండి బెనిఫిట్ షోలు షెడ్యూల్ చేసారు. బెనిఫిట్ షోల కోసం రూ.500 (జీఎస్‌టితో కలిపి) వరకూ ఉంటుందని అంచనా. వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం.. చిత్రానికి సింగిల్ స్క్రీన్‌లకు రూ.75 అదనం కాగా, మల్టీప్లెక్స్‌లకు టిక్కెట్ రేటు పెంపుదల రూ.100 వరకూ ఉంటుంది. మూడు చిత్రాలకు భారీ పెంపులు ఉండే ఛాన్సుంది. టికెట్ ధరల పెంపునకు అధికారిక జీవో జారీ అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఓపెనింగ్స్ భారీగా వచ్చే వీలుంది. మరోవైపు తెలంగాణలో టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలపై ఇంకా సందిగ్ధత నెలకొంది. –తుపాకి.కామ్ సౌజన్యంతో







ఏటా కోటా కోచింగ్ వ్యాపారం:-
మూడు వేల కోట్ల రూపాయలు
చిన్నా పెద్ద కోచింగ్ సెంటర్లు:-
100
బయటినుండి వచ్చి చదువుకునే విద్యార్థులు:-
ఏటా ఒకటిన్నర లక్షల మంది
ఒక్కొక్కరి ఫీజు:-
సంవత్సరానికి రెండు లక్షల దాకా
ఊళ్లో హాస్టల్స్:- 3,000
మెస్సులు, క్యాంటీన్లు:- 1,800
గది అద్దె:-
ఒక్కొక్కరికి 15,000/-

# కూలనున్న కోటలు!

రాజస్థాన్ కోట పోటీ పరీక్షలకు పెట్టని కోట. కట్టని కోట. ప్రత్యేకించి ఐ ఐ టీ ప్రవేశ పరీక్షలకు కోట పెట్టింది పేరు. కోట కీర్తి ప్రతిష్ఠలకు సంబంధించినవే పై అంకెలు. పది లక్షల జనాభా దాటని కోట పట్టణంలో లక్షల మంది పిల్లలు బయటి నుండి వచ్చి హాస్టళ్లలో ఉంటూ కోచింగ్ తీసుకుంటూ ఉంటారు. ఏటా కోటాలో ఈ విద్యా వ్యాపారం మూడు వేల కోట్ల రూపాయలు దాటుతుంది. దేశవ్యాప్తంగా కోటా కోచింగ్ సెంటర్లకు డిమాండ్ పెరగడంతో దేశంలోని మిగతా నగరాల్లో కూడా కోటా విస్తరించిన కొమ్మల బ్రాంచులు వెలిశాయి. ఐ ఐ టీ ప్రవేశ పరీక్ష రాసేవారిలోనుండి ఎంపిక అయ్యేవారి శాతాన్ని లెక్కకడితే సరిగ్గా ఒక్క శాతం కూడా దాటదు. కానీ మిగతా 99 శాతం మంది ఖర్చు, శ్రమ, ఒత్తిడి, బాధలో తేడా ఏమీ ఉండదు. గెలిచిన ఒకరిని చూస్తూ మనమూ గెలవకపోతామా అని ఆశపడడమే కోచింగ్ సెంటర్లకు పెట్టుబడి.

రాజస్థాన్ కోట పట్టణంలో ఇప్పుడు శూన్యం, నైరాశ్యం రాజ్యమేలుతోంది. ఆమధ్య కోవిడ్ దెబ్బకు కోచింగ్ సెంటర్లు తాత్కాలికంగా మూత పడి మళ్ళీ తెరుచుకున్నాయి. తరువాత రెండు, మూడేళ్ళుగా వరుసగా కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. రోజుకు 18 గంటల కోచింగ్ ఒత్తిడిబీ నెలవారీ పరీక్షలు, సమీక్షల ఒత్తిడిబీ ఉన్న కోచింగ్ సెంటర్లోనే అత్యుత్తమ అధ్యాపకులు బోధించే క్లాసులో పదేంతగా మార్కులు తెచ్చుకోలేక సాధారణ తక్కువ స్థాయి అధ్యాపకులు(?) బోధించే క్లాసులో ఉన్నామే అన్న అవమానంబీ తల్లిదండ్రుల ఆశల ఒత్తిడి.. ఇలా హాస్టల్ గదిలో ఫ్యాన్లకు ఉరివేసుకున్న ఒక్కో విద్యార్థిది ఒక్కో విషాదగాథ.

చదువు ఇప్పుడొక ఇష్టం కాదు- కష్టం.
చదువు ఇప్పుడొక ఉపాధి కాదు- వ్యాపారం.
చదువు ఇప్పుడొక విజ్ఞానం కాదు- విలయం.
చదువు ఇప్పుడొక వికాసం కాదు- విషాదం.
చదువు ఇప్పుడొక సంస్కారం కాదు- సంక్షోభం.
చదువు ఇప్పుడొక ఆనందం కాదు- ఆడలేని ఎత్తుల చదరంగం.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న ప్రభుత్వం కోటా కోచింగ్ పద్ధతులు, హాస్టళ్లలో పరిస్థితులమీద దృష్టి పెట్టింది. వందశాతం మార్కులు సాధించలేని పిల్లలను వందశాతం ఆశల ఊబిలోకి కోచింగ్ సెంటర్లు ఎలా దించుతున్నాయో ప్రభుత్వానికి అర్థమయ్యింది. అత్యుత్తమ, ఉత్తమ, సాధారణ, మొక్కుబడి పేరిట చేసిన క్లాసుల విభజనకు ప్రభుత్వానికి తలతిరిగింది. కోటా కోచింగ్ సెంటర్లలో వారం వారంబీ నెల నెలా విద్యార్థుల ఆత్మహత్యలు ఎన్ని జరుగుతున్నాయో, క్రమంగా ఎలా పెరుగుతున్నాయో దేశానికి తెలిసింది. ఫలితంగా ఇతరప్రాంతాలనుండి కోటాకు వచ్చి కోచింగ్ సెంటర్లలో చేరే విద్యార్థుల సంఖ్య ఒకప్పటితో పోలిస్తే 40 శాతం తగ్గిపోయింది. దాంతో చాలా హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్ అకామిడేషన్లు, మెస్సులు, క్యాంటీన్లు మూత పడ్డాయి. మరికొన్ని మూసివేత దారిలో ఆరిపోయే ముందు దీపంలా మిణుకు మిణుకు మంటున్నాయి. కొన్ని కోచింగ్ సెంటర్లు ఆన్ లైన్ క్లాసులు మొదలు పెట్టినా ఆర్థికంగా సరిపోవడం లేదు. ఒక్కసారిగా వ్యవస్థ కుప్పకూలినట్లుంది కోట కోచింగ్ సెంటర్ల పరిస్థితి. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఐ ఐ టీలకు పిల్లలను పంపగలిగేంత తెలివయిన కోట.. ఇప్పుడు తెలివి కోల్పోయి దిక్కులు చూస్తోంది. దశాబ్దాలుగా చదువులతో కళకళలాడిన కోట చదువులు కోట గోడ దాటడం లేదు. చదువుల కోట బీటలువారింది. ఐ ఐ టీ ప్రవేశ పరీక్షలకు పెట్టని కోట.. ఇప్పుడు ఎవరికీ పట్టని కోట అయ్యింది. అవ్వాలి కూడా.


అందుకే అంటారు. అతి చేస్తే గతి చెడుతుందని.

కోట పెరిగింది... కోట వెలిగింది.
కోట అతి చేసింది... కోట తరిగింది...కోట కూలింది.

దేశంలో ఇలా కూలనున్న, కూలకతప్పని కోటలు ఇంకా ఎన్నో? ఎన్నెన్నో? రెక్కవిప్పి ఆకాశమే హద్దుగా ఎగరాల్సిన, ఎదగాల్సిన ఎన్నెన్ని జీవితాలు ఫ్యాన్ రెక్కలకు ఉరివేసుకుని ఊపిరాడక కోటాల పునాదుల్లో ఉన్నాయో! తెలుసుకోకపోతే, వినకపోతే, కళ్ళుతెరవకపోతే మనం చెవులున్న చెవిటివాళ్ళం. నోరున్న మూగవాళ్ళం. కళ్ళున్న కబోదులం. మనసున్న అమనుష్యులం.

-పమిడికాల్వ మధుసూదన్





Courtesy: Andhra Jyothi

## కోచింగ్ 'కోట'కు బీటలు

కోటాలోని కోచింగ్ సెంటర్లలో 40% మేర తగ్గిన ప్రవేశాలు

- తీవ్ర సంక్షోభంలోకి హాస్టళ్లు
- చిరు వ్యాపారులపైనా ప్రభావం
- ఐదో వంతుకు పడిపోయిన అద్దెలు

కోటా, డిసెంబరు 25: విద్యార్థులను వారి జ్ఞానంతో కాకుండా.. బట్టీపట్టడం ద్వారా వచ్చే మార్కులతో, ర్యాంకులతో మాత్రమే కొలిచే సమాజం మనది. అలాంటి చదువుల'బట్టీ'లకు పేరొందిన నగరం.. రాజస్థాన్‌లో మూడో అతిపెద్ద నగరమైన కోటా. కండరాలు క్షీణించే (మస్క్యులర్ డిస్ట్రోఫీ) వ్యాధితో చక్రాల కుర్చీకే పరిమితమైన వినోద్ కుమార్ బన్సల్ అనే ఐఐటీ పట్టభద్రుడు.. 1991లో ఎనిమిది మంది విద్యార్థులకు తన ఇంట్లో డైనింగ్ టేబుల్ వద్ద మొదలుపెట్టిన శిక్షణ కోటాలో కోచింగ్ కేంద్రాల విస్ఫోటానికి కేంద్ర బిందువు. ఆయన దగ్గర శిక్షణ పొందిన ప్రమోద్ మహేశ్వరి అనే మరో ఐఐటీ పట్టభద్రుడు కెరీర్ పాయింట్ పేరుతో మరో కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించాడు. అలా ఒకదాని తర్వాత ఒకటిగా వందల సంఖ్యలో కోచింగ్ సెంటర్లు పుట్టుకురావడంతో కోటా దేశంలోనే అతిపెద్ద 'ప్రవేశ పరీక్షల శిక్షణ కేంద్రం'గా మారిపోయింది. ఎలెన్, రెజొనెన్స్, మోషన్, అన్అకాడమీ, ఫిజిక్స్‌వాలా, ఆకాశ్, సర్వోత్తమ్.. ఇలా జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ దిగ్గజాలతోపాటు చిన్నాచితకా శిక్షణ కేంద్రాలతో దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కళకళలాడుతూ వస్తున్న కోటా నగరం ఈ ఏడాది చిన్నబోయింది. కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల గురించి విస్తృతంగా ప్రచారం జరగడం, కోచింగ్ సెంటర్లను నియంత్రిస్తూ ఈ ఏడాది జనవరిలో కేంద్ర సర్కారు తీసుకొచ్చిన కొత్త మార్గదర్శకాలు, ప్రముఖ కోచింగ్ సెంటర్లు దేశవ్యాప్తంగా తమ శాఖలను విస్తరించడం.. ఇలా రకరకాల కారణాల వల్ల కోటాకు వచ్చే విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది బాగా తగ్గిపోయింది. అంకెల్లో చెప్పాలంటే.. సాధారణంగా కోటాకు ఏటా దాదాపు లక్షన్నర నుంచి రెండు లక్షల మంది దాకా విద్యార్థులు.. వివిధ ప్రవేశపరీక్షలకు సంబంధించిన శిక్షణ నిమిత్తం వస్తుంటారు. కానీ, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 85 వేల నుంచి లక్ష దాకా మాత్రమే ఉన్నట్టు సమాచారం. కోచింగ్ సెంటర్ల వల్ల అక్కడ జరిగే వ్యాపారం కిందటి సంవత్సరంగా దాకా ఏడాదికి రూ.6,500 కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల దాకా ఉండేది. అది ఈ ఏడాది రూ.3,500 కోట్లకు పడిపోయింది!! కోచింగ్ సెంటర్లే కాదు.. విద్యార్థుల కోసం నిర్మించిన వేలాది హాస్టళ్లు సైతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కోటా నగరం మొత్తమ్మీదా ఇలా విద్యార్థుల కోసం నిర్మించిన హాస్టళ్లు 4,500 దాకా ఉంటాయని అంచనా. ఒకప్పుడు విద్యార్థులతో నిండిపోయి కళకళలాడిన ఈ హాస్టళ్లు.. ఇప్పుడు 40-50 శాతం ఆక్యుపెన్సీ కూడా లేక వెలవెలబోతున్నాయి. బ్యాంకుల్లో అప్పులు తీసుకుని హాస్టళ్లు నిర్మించి వాటిని నడిపినవారు.. ఇప్పుడు విద్యార్థులు లేక, రాబడి రాక.. బ్యాంకులకు నెలవారీ చెల్లింపులు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కిందటి సంవత్సరం దాకా నెలకు రూ.15 వేలు వసూలు చేసిన హాస్టళ్లు.. ఇప్పుడు రూ.9 వేలకే అన్ని సౌకర్యాలూ కల్పించడానికి సిద్ధమైనా పూర్తిగా నిండని పరిస్థితి నెలకొంది. అలాగే.. ఈ కోచింగ్ సెంటర్లపై ఆధారపడి జీవనం సాగించే జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలవారు, ఆటో డ్రైవర్లు, హోటళ్లు, మెస్‌ల యజమానులు, వాటిలో పనిచేసే సిబ్బంది.. ఇలా లక్షలాదిమందిపై ఈ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోంది. అలాగే దుకాణాల అద్దెలు రూ.15 వేల నుంచి రూ.3 వేలకు పడిపోయాయి. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటాకు విద్యార్థుల రాక తగ్గిపోయి ఆ ప్రభావం స్థానిక ఆర్థిక వ్యవస్థపై పడడంతో.. అక్కడి వ్యాపారులు ఐటీ పరిశ్రమపై దృష్టి సారించారు.

కోటా.. జాతీయస్థాయిలో పేరొందిన కోచింగ్ సెంటర్ల కేంద్రం! నీట్, యూపీఎస్సీ, ఐఐటీ జేఈఈ.. తదితర ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలనుకునే విద్యార్థుల తొలి గమ్యస్థానం!! కానీ.. లక్షలాది మంది విద్యార్థులతో కళకళలాడిన కోటా ఇప్పుడా పూర్వవైభవాన్ని కోల్పోయింది! విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య పెరుగుతుండడంతో.. అక్కడి శిక్షణ కేంద్రాల్లో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది ఆ సంఖ్య 30-40% మేర పడిపోయింది. ఆ ప్రభావం.. హాస్టళ్లు, మెస్‌లు, ఇతర చిరువ్యాపారాలపై తీవ్రంగా పడుతోంది!! రద్దీ లేని రోడ్లు.. ఎటు చూసినా 'అద్దెకు', 'అమ్మకానికి' అనే బోర్డులు.. ఇదీ ఇప్పుడు అక్కడి పరిస్థితి!!

24

రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం కోటాలో 2023లో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన విద్యార్థుల సంఖ్య ఇది. 2022లో ఈ సంఖ్య 15 కాగా.. 2019లో 18 మంది, 2018లో 20 మంది, 2017లో ఏడుగురు, 2016లో 17 మంది, 2015లో 18 మంది చనిపోయారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా కోటాలోని కోచింగ్ సెంటర్లన్నీ మూతపడడంతో ఆ రెండేళ్లూ విద్యార్థులు క్షేమంగా ఉన్నారు.

**అలా మొదలైంది..**

1994లో.. కోటాలోని కోచింగ్‌సెంటర్లకు చెందిన 15 మంది విద్యార్థులకు ఐఐటీల్లో ప్రవేశం లభించడంతో ఆ నగరం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఆ తర్వాత ఏడాది ఏకంగా 51 మంది ఐఐటీల్లో సీట్లు సాధించడంతో.. అందులో ఐదుగురు టాప్100లో చోటు సాధించారు. 2000 సంవత్సరంలో.. ఐఐటీల్లో సీట్లు సాధించిన టాప్-10లో ముగ్గురు (1, 2, 7 ర్యాంకులు) కోటా విద్యార్థులే కావడంతో.. అక్కడి కోచింగ్ సెంటర్లకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు వెల్లువెత్తడం మొదలైంది.

## ప్రజలంతా సుఖ సంతోషాలతో విలసిల్లాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పోలాకి మండలం మబగాంలో గల తన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బగ్గు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయడంలో తీవ్రంగా శ్రమించారని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల్లో గందరగోళ వాతావరణం నెలకొని ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారన్నారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యత క్రమంలో అందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు తోడుగా నిలుస్తున్నారన్నారు.







## రథసప్తమిని ఘనంగా జరుపుకుందాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- ప్రపంచమంతా వెలుగునిచ్చే దేవుడు సూర్య భగవానుడు
- రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకే అభిప్రాయ సేకరణ
- భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు
- ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రపంచం మొత్తానికి వెలుగునిచ్చే దేవుడు సూర్య భగవానుడని, ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు పండగ వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం భక్తుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించే కార్యక్రమానికి శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అధ్యక్షత వహించారు. అరసవల్లి రథసప్తమి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించినందున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖా మంత్రి రామనారాయణరెడ్డి, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మూడు రోజులు పండగలా చేసుకోవడాని ప్రజలు అందరూ సహకరించాలన్నారు. వచ్చేనెల 2,3,4 తేదీలలో రథసప్తమి జరగనున్న నేపథ్యంలో వేడుకలను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. మూడు రోజులు పండగలలో భాగంగా వచ్చేనెల 2న శోభాయాత్రతో ఉత్సవ వేడుకలు ప్రారంభం కానున్నాయన్నారు. నిర్వహణకు అందరి సలహాలు సూచనలు తీసుకుంటామన్నారు. ఆ శోభాయాత్రలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న సాంస్కృతి, సంప్రదాయం ఉంటుందని, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 03న సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో సౌరయాగం నిర్వహిస్తామన్నారు. ప్రతీరోజు శ్రీకాకుళం జిల్లా చరిత్రతో కూడిన లేజర్ షో ఏర్పాటు చేస్తామన్నారు. దేవాలయాలు అభివృద్ధి చెందిన నాడే మనం అభివృద్ధి చెందుతామన్నారు. శ్రీకూర్మం శ్వేత పుష్కరిణి ఆధునికరణకు రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, షాప్‌లు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యుత్ అలంకరణ చేయాలన్నారు. డచ్ బిల్డింగ్ దగ్గర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెలికాప్టర్‌ను భక్తుల వినోదం కోసం ఏర్పాటు చేస్తామన్నారు. నగర సుందరీకరణకు సంబంధించి మున్సిపాలిటీకి రూ.రెండుకోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. నిర్దేశిత సమయంలో ప్రోటోకాల్ పాస్‌లకు అనుమతిస్తామన్నారు. డోనర్ పాసులు కావలసిన వారు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రతీ పాస్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ఉచిత దర్శనం క్యూ నిరంతరం కొనసాగుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన వేడుకల్లో విధులు నిర్వహించిన అధికారులు, భక్తుల నుండి సలహాలు, సూచనలు తీసుకుని మరింత ఘనంగా వేడుకలు నిర్వహించాలనేదే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఈఓ వై ఎల్.భద్రాజీ, మునిసిపల్ కమీషనర్ ప్రసాద్, జిల్లా గ్రామీణభివృద్ధి పథకం సంచాలకులు కిరణ్‌కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి వి శ్రీధర్ రాజ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## రిక్రూట్‌మెంట్‌ను పరిశీలించిన ఎస్పీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో గురువారం 3వ రోజు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులు ఎంపిక సరళిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. సర్టిఫికెట్లు పరిశీలన, ఛాతీ, ఎత్తు, 1600,100 పరుగు, లాంగ్ జంప్ తదితర ఈవెంట్‌లలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.



## విశ్రాంత ఉద్యోగులకు చేయూత

(సత్యంన్యూస్, పొందూరు)

కదలలేని స్థితిలో, మంచానికే పరిమితమైన విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛనుదార్లకు జీవన ధ్రువీకరణ పత్రాలను వారి ఇంటి వద్దకే వెళ్లి ఫేస్ రికగ్నిషన్ యాప్‌తో ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రామచంద్రరావు, అంకం ధర్మారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ముందుగా శ్రీకాకుళం నగరపరిధిలోని వారికి ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 4నుంచి ఈ సౌకర్యాన్ని తమ సంఘం ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్టు వివరించారు. తమ సంఘ ప్రతినిధులు ఎన్.వి.రమణ, సెల్:8341275557, పి.శాంతారావు, సెల్:8555919837 ను సంప్రదించవచ్చునన్నారు. అలాగే ఈనెల 21నుంచి శ్రీకాకుళం ఎన్.జి.వో హోంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జీవన ప్రమాణ పత్ర స్వీకరణ పత్రాల ప్రక్రియను ఉచితంగానే నిర్వహించనున్నట్టు రామచంద్రరావు, ధర్మారావు పేర్కొన్నారు.















# పేకాట శిబిరాలకు పోలీసుల రూట్‌మ్యాప్

(మొదటిపేజీ తరువాయి)

ఉంటూ ఇంటికి వెళ్లడంలేదని తెలిసింది. ఇప్పటి వరకు తల్లిదండ్రులే తనపై చేయి చేసుకోలేదని, అలాంటిది వేరొకరు తనపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్టు తెలుస్తుంది. దీంతో బెండి తులసీ, సీపాన శ్రీను, గోపీకృష్ణ మాత్రమే రోజు 30 మంది కాపలాదారులతో బెండిగేటు మీదుగా టెక్కలిపట్నం నుంచి గారబందకు ఐదు కార్లలో వెళుతున్నట్టు తెలిసింది. బెండి తులసీ తన మామను వెంట తీసుకువెళ్లి రోజుకు రూ.2వేలు ఇస్తున్నట్టు తెలిసింది. కొత్తరోడ్డు నుంచి వెళుతున్న 30 మంది కాపలా దారులకు ఒక్కొక్కరికీ రూ.1500 ఇస్తున్నారని వినికిడి. లాభం వచ్చిన రోజు అదనంగా మరో రూ.వెయ్యి ఇస్తున్నారని సమాచారం. వీరికి తోడుగా నగరానికి చెందిన ధర్మాన శ్రీను, చల్లా రాజును తీసుకువెళుతున్నారు. వీరిలో చల్లా రాజుకు స్పాట్‌లో రూ.10 వడ్డీకి డబ్బులు ఇచ్చే దందా అప్పగించారని తెలిసింది. మొత్తం 18 వాటాలతో ప్రస్తుతం నడుస్తున్న గారబంద పేకాట




శిబిరంలో తులసీ, తేజ, శ్రీనులకు 8 వాటాలు ఉండగా, గోపికృష్ణకు ఒక్క వాటా ఉన్నట్టు తెలిసింది. మిగిలిన వాటాలు నరసన్నపేటకు చెందినవారివిగా తెలిసింది. ఈ విషయాలన్నీ పాతపట్నం పోలీసు సర్కిల్ పరిధిలో పోలీసు సిబ్బందికి తెలిసే జరుగుతున్నా రోజువారీ చెల్లింపుల కారణంగా ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

## ఎయిర్ ప్యాకేజీలు ప్రకటించిన ఐఆర్‌సీటీసీ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలను గురువారం ప్రకటించింది. కేరళ, మేఘాలయ రాష్ట్రాల్లో పర్యాటకుల కోసం బుకింగ్‌లు ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. సుందరమైన కేరళ పేరుతో ఏడు పగళ్లు, ఆరు రాత్రులు ప్యాకేజీ కింద కొచ్చి, మున్నార్, కుమరకోం/ అలెప్పీ, తేక్కడి, త్రివేంద్రమ్‌లలో ఎకో టూరిజం, ఆధ్యాత్మిక టూరిజం ప్యాకేజీలకు సంబంధించి ఈ నెల 24 నుంచి 30 వరకు పర్యటన ఉంటుందన్నారు. అలాగే మేజికల్ మేఘాలయ పేరుతో ఆరు రాత్రులు, ఏడు పగళ్లు ప్యాకేజీ కింద గౌహతి, చిరపుంజి, మావ్లిన్నాంగ్‌లలో ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు పర్యటన ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 92810 30748 (చందన్‌కుమార్), 92814 95847 (సాయి ప్రసాద్), 95501 66168 (వెంకటేశ్వరరావు)లను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

# విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంగన్వాడి కేంద్రాలను ఆయా సీడీపీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే వారిపై కఠినచర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల పనితీరు గురించి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ, సంబంధిత సీడీపీవోలతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు సకాలంలో పాలు, గుడ్లు పంపిణీ జరగాలని, ముఖ్యంగా గర్భిణీలు, పిల్లలలో పోషకాహార లోపం లేకుండా చూడాలని, అంగన్వాడి కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల పనులను త్వరగా పూర్తి చేయాలని, ఈ విషయంలో గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారుల సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు తప్పనిసరిగా చేపట్టాలని, ఈ విషయంలో వెనకబడ్డ సీడీపీవోలు పనితీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని అన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టడానికి గ్రామస్థాయి, మండల స్థాయిల్లో నిర్వహించబోయే సమావేశాలు అవగాహన కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేసి తనకు సమర్పించాలన్నారు. ఐసీడీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది అంకిత భావం, చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# 5న పురుషోత్తంనాయుడు ఆత్మీయ అభినందన సత్కారం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వాణిజ్య పన్నుల శాఖలో గూడ్స్ సర్వీస్ టాక్స్ అధికారిగా, ఏపీ ఎన్జీవో గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జీఎస్టీ అధికారులు, ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా సుదీర్ఘ కాలం సేవలందించిన చౌదరి పురుషోత్తంనాయుడు డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన 80అడుగుల రోడ్డులోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నామని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 5న జరిగే ఆత్మీయ అభినందన సభకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.వి.శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లా ఎన్జీవో అసోసియేషన్ చైర్మన్ హనుమంతు సాయిరాం ఆహ్వాన కమిటీ తరఫున స్వాగత పలుకులు, అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్య అతిథిగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు, విలక్షణ అతిథులుగా ప్రజా ఉద్యమ పితామహుడు చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మ దంపతులు హాజరై ఆశీస్సులు అందిస్తారని, విశిష్ఠ అతిథులుగా ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర ఎమ్మెల్సీ ఉద్యోగ ఉద్యమ నాయకులు పరుచూరి అశోక్‌బాబు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ స్పీకర్, ఇతర అధికారులు, విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంతా తరలిరావాలని ఆహ్వాన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## పురుషోత్తంనాయుడుని అభినందించిన సీఎం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శగా సేవలందించిన చౌదరి పురుషోత్తంనాయుడిని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. పలాస వాణిజ్యపన్నుల శాఖ అధికారిగా గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన పురుషోత్తంనాయుడు ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శ హోదా నుంచి తప్పుకునే ముందు సీఎంను అమరావతిలోని ఆయన నివాసంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యాసాగర్‌తో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవో సంఘానికి సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో పురుషోత్తంనాయుడు అందించిన సేవలను సీఎం కొనియాడారు.

## అరకొర పరికరాలతో పనులు ప్రారంభం

(సత్యంన్యూస్, సోంపేట)



గొల్లగండి పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లగండి, చేపల గొల్లగండి, రామాయపట్నం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, ఐరన్ క్రాస్ ఆర్మ్స్, కేబుల్ సమస్యను పరిష్కరించాలని నవంబరులో పెట్టుకున్న అర్జీ మేరకు స్పందించిన అధికారులు గురువారం నుంచి అరకొర పరికరాలతో పనులు ప్రారంభించారు. ఒక్క గొల్లగండి గ్రామంలోనే 20 విద్యుత్ స్తంభాలు, ఐరన్ క్రాస్ ఆర్మ్స్, కేబుళ్లు పూర్తిగా పాడైపోగా, విద్యుత్ శాఖ మాత్రం 5 స్తంభాలు, కొద్దిగా కేబుళ్లు పంపించారని మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు గండుపల్లి చిన్నరాజారావు 'సత్యం'కు తెలిపారు. ప్రస్తుతం ఈ గ్రామానికి వచ్చిన పరికరాల వల్ల ఒక్క గ్రామంలో కొన్ని వీధులకు కూడా కేబుళ్లు వేసే పరిస్థితి లేదని, ఇక మిగిలిన రెండు గ్రామాల పరిస్థితి ఏమిటని ఆయన విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. 22 స్తంభాలు, అందుకు సంబంధించిన ఐరన్ క్రాస్ ఆర్మ్‌లు, కేబుళ్లు ఉంటేగాని తమ సమస్య పరిష్కరించినట్లు కాదని చిన్నరాజారావు పేర్కొన్నారు.

# వినికిడి పరికరాన్ని అందించిన ఉమాశంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్న కీర్తన అనే చిన్నారికి డిజిటల్ వినికిడి పరికరాన్ని ఎమర్జెన్సీ బ్లడ్‌సర్వీస్ ప్రతినిధులు గురువారం అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన రావు, లైన్ డాక్టర్ పైడి. సింధూర మాట్లాడుతూ ప్రతి రోజు ఏదో ఒక సేవా కార్యక్రమంలో నిమగ్నమవుతున్న బొట్టా సాయి, ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ సేవలు అమూల్యమని అన్నారు. లావేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన యు.నారాయణరావు, మంగమ్మల కుమార్తె కీర్తన(8)కు పుట్టుకతో వినికిడి సమస్య కారణంగా ఏమీ వినపడదు. తండ్రి రోజువారి వ్యవసాయ కూలి. ఆర్థిక స్థోమత లేని కారణంగా కీర్తనకు వినికిడి పరికరం కొనే స్థోమత లేక ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్‌ని కోరారు. ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ గ్రూప్‌లో ఉండే సభ్యులు, ఇతర మిత్ర బృందం తలో చెయ్యి వేసి చిన్నారికి అవసరమైన డిజిటల్ వినికిడి పరికరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్ మోహన్‌రావు, లైన్స్ క్లబ్ సెంట్రల్ కార్యదర్శి డాక్టర్ పైడి సింధూర చేతుల మీదుగా శాంతా కళ్యాణ్ అనురాగ నిలయంలో చిన్నారుల మధ్య అందించారు. వినికిడి పరికరానికి కొంత నగదుని తగ్గించటంలో సహకరించిన ఖ్యాతి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ ఆర్.శ్రావణిని, స్పందించి సహకారమందించిన సుసరాపు శ్రీలతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, పీవీఆర్ఎం పట్నాయక్, సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్, బొట్టా సాయి కుమార్, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఫౌండర్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, బి. జగదీష్, బాధిత కుటుంబ సభ్యులు, శాంతా కల్యాణ అనురాగ నిర్వాహకురాలు లలిత, సాయి సుధాకర్, చిన్నారులు పాల్గొన్నారు.

# సైన్స్ ఎగ్జిబిషన్ విజేతలకు రామరాజు ట్రస్ట్ సత్కారం

(సత్యంన్యూస్, కొత్తూరు)

గత నెల 30న వసప కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఆవరణలో జరిగిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ స్థానం సాధించి, విజేతలైన పాతపొన్నుటూరు బాలికలకు రామరాజు ట్రస్ట్ ఘనంగా సత్కరించింది. పాతపొన్నుటూరు ఎంపీయూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పారిశర్ల రామరాజు పుష్పగుచ్ఛం, నగదు పారితోషికాలను బహూకరించి బాలికలను ఆశీర్వదించారు. గైడ్ టీచర్‌గా వ్యవహరించిన అంధవరపు రాజేష్‌ను, ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో బయోగ్యాస్ ప్రోజెక్ట్‌ను ప్రదర్శించిన 8వ తరగతి బాలికలు పతివాడ హరిణి, సవిరిగాన శ్రావ్య, అంధవరపు హిమబిందులను రామరాజు అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని తోటి విద్యార్థులు కూడా సత్ఫలితాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల మూడో తేదీన జరగనున్న జిల్లా స్థాయి



సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఈ ప్రాజెక్ట్ అర్హత సాధించడం పట్ల రామరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పైసక్కి చంద్రశేఖరం, బూడిద సంతోష్‌కుమార్, యిపై సౌజన్యవతి, బొమ్మాళి నాగేశ్వరరావు, కుదమ తిరుమలరావు పాల్గొన్నారు.

# మానవత్వం మంటగలిసిన వేళ

## - బైక్‌తో గుద్ది పట్టించుకోకుండా వెళ్లిపోయిన వైనం -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నూతన సంవత్సరం మొదటి రోజు బుధవారం డే అండ్ నైట్ జంక్షన్ దగ్గర రైతు బజార్ ముందు ఉన్న అపోలో ఫార్మసీ ముందు ఉదయం 11:45 గంటలకు ఒక ఆక్సిడెంట్ జరిగింది. బొడ్డేపల్లి విజయకుమార్ అనే వ్యక్తి రామలక్ష్మణ జంక్షన్ నుంచి 30 కిలోమీటర్ల కంటే తక్కువ స్పీడ్‌తో వస్తూ వుండగా రైతుబజార్ దగ్గర అపోలో ఫార్మసీ ముందు లెఫ్ట్ రోడ్డు నుంచి ఒక బైక్‌తో వచ్చి మైన్ రోడ్ పైకి తిప్పినప్పుడు విజయ కుమార్ బైక్ పైకి వచ్చేశారు. తను సడెన్ బ్రేక్ వేయగా బైక్ కింద స్లోగా పడింది. తనూ కింద పడ్డాడు. రోడ్‌పై నుంచి లేచే లోపు ఆపోజిట్‌గా ఒక బైక్ ఫాస్ట్‌గా వచ్చింది. ఈ నేపథ్యంలో విజయకుమార్ హెడ్‌కి బలంగా ఆ బైక్ ఫుట్‌రెస్ట్ తగిలింది. దీంతో విపరీతంగా రక్తస్రావం జరిగింది. తనకు రోడ్డు దెబ్బే తగిలిందనుకునే లోపే ఇది అంతా జరిగిపోయింది. రక్తం కంట్రోల్ అవ్వకుండా విపరీతంగా కారుతున్నా అక్కడ ఎవరు కనీసం సహాయం చేయడానికి రాలేదు. కనీసం 108కి కూడా కాల్ చేయలేదు. అక్కడ ఒక ఫ్రూట్ షాప్‌వాడు మాత్రమే వచ్చి పట్టుకొని నడిపించుకొని దగ్గరలోని ముద్దాడ చిన్నబాబు హాస్పిటల్‌కి వెళితే డాక్టర్ వేరే సర్జరీ చేస్తున్నారని, ఇక్కడ అవ్వదని సమాధానమిచ్చారు. డే అండ్ నైట్ జంక్షన్ వరకు వెళితే అక్కడికి వాళ్ల స్నేహితులు వచ్చి రిమ్స్‌కి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ఏడు కుట్లు పడ్డాయి.

అపోలో ఫార్మసీ దగ్గర లెఫ్ట్ సైడ్ నుంచి ఫస్ట్‌గా వచ్చిన బైకర్ గానీ, ఆపోజిట్‌లో వచ్చి హెడ్ ఇంజూరీ చేసిన బైకర్ గానీ బైక్స్ ఆపకుండా, కనీసం ఏం జరిగిందో, ఉన్నాడో, పోయాడో తెలుసుకోకుండా వెళ్లిపోయారు. ముందుగా రోడ్డు తగిలి దెబ్బ తగిలిందనుకున్న విజయకుమార్ తర్వాత జరిగింది గ్రహించి ఎంఎల్‌సీ కేసుగా ఫైల్ చేసి పోలీసు కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు దగ్గరలో ఉన్న సీసీ కెమెరా రికార్డ్స్‌ను పరిశీలించి, అలాంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని విజయకుమార్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.



## ఘనంగా కల్పతరువు దినోత్సవం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

రొట్టవలస శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం కల్పతరువు దినోత్సవాన్ని నిర్వహించారు. రామకృష్ణ పరమహంస జనవరి 1న భక్తులకు భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను అనుగ్రహిస్తూ అవతార వైభవాన్ని ప్రకటించిన సందర్భంగా ప్రతీ ఏటా కల్పతరువు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి సారధ్యంలో రొట్టవలస భజన బృందాలు, గీతా పారాయణ బృందం, నగర సంకీర్తన బృందం సంయుక్తంగా విశేష కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మావుదూరి సుబ్రహ్మణ్యశర్మ, సమితి అధ్యక్షులు మందపల్లి రామకృష్ణారావు, పాంద్రంకి నారాయణరావు, మూడడ్ల రమణమూర్తి, ఎం. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.